# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :200 | ప్రచురణ : హైదరాబాద్ | శనివారం,30-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00




### కేదారనాథ్‌లో వీఐపీ దర్శనాలకు చెక్

- ఇకపై ఎవరైనా రూ.1100 టికెట్ తీసుకుంటేనే ఎంట్రీ!
- కేదార్‌నాథ్‌లో ఇకపై రూ.1100 టికెట్
- వీఐపీ సంస్కృతికి చెక్ పెట్టేలా ఆలయ కమిటీ కీలక నిర్ణయం

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు

# ముహూర్తం ఫిక్స్

- జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇళ్లను ప్రారంభించనుంది.
- ఆ రోజే రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం.
- సెకండ్ ఫేజ్ కింద రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం
- తొలి విడతలో కేటాయించిన ఇళ్లల్లో లక్ష ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకోగా..
- జూన్ 1న గృహప్రవేశాలు చేయనున్నారు



హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇళ్లను ప్రారంభించనుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆ రోజున ఆసిఫాబాద్ జిల్లా కెరమరి మండలం కొరారి గ్రామంలో రెండో విడత ఇళ్లను మంజూరు చేయనున్నారు. సెకండ్ ఫేజ్ కింద రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన చాలామంది పేదలు రెండో విడత ఇళ్ల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు ప్రభుత్వం మంజూరు చేయనుండటంతో ఫుల్ ఖుషీ వివరాలు 2లో..



## హైదరాబాద్ పరిధిలో ఎంఐజీ, ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు

# సర్కార్ గ్రీన్‌సిగ్నల్

సొంతింటిలో నివసించాలనేది అనేక మంది పేదల కల. దీనిని సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. దీనిలో భాగంగానే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే తొలివిడతో చాలావరకు ఇళ్లు పూర్తయ్యి ప్రారంభోత్సవాలు చేసింది. అయితే రాజధాని

వివరాలు 2లో..



### ప్రధాని మోదీకి తన ప్రభుత్వ మనుగడపై తప్ప, విద్యార్థుల భవిష్యత్‌పై శ్రద్ధ లేదు

- సీబీఎస్ఈ వివాదంపై ప్రధాని మోదీ మౌనం
- కేంద్ర విద్యాశాఖ మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోని వైనం
- దీనిపై మండిపడిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## దేశంలో నైరుతి రుతుపవనాలు

- ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలు: ఐఎండీ
- ఈశాన్య ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదు
- మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండొచ్చని అంచనా



## సెక్యులర్ ఓటు బ్యాంకును

# తొలగించే కుట్ర



- పీసీసీ చీఫ్ ఆరోపణ
- గాంధీభవన్‌లో సర్‌పై అవగాహన తరగతులు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ
- కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న సర్‌పై నాయకులకు అవగాహన
- బీజేపీపై విమర్శలు చేసిన పీసీసీ చీఫ్

హైదరాబాద్

సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న సర్‌పై పార్టీ నాయకులకు అవగాహన కల్పించేందుకు గాంధీభవన్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాలు, అడ్వైజరీ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఏఐసీసీ శిక్షణ విభాగం నుంచి వివరాలు 2లో..

## 'రిజర్వ్ చేసిన తీర్పులు గరిష్ఠంగా 3నెలల్లోపు వెలువరించాలి'



- హైకోర్టుల్లో విచారణల జాప్యంపై సుప్రీం
- బెయిల్ దరఖాస్తులపై విచారణ పూర్తైన రోజే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశం
- బెయిల్ లేదా శిక్ష నిలుపుదలకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే సంబంధిత జైలు అధికారులకు పంపాలన్న సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం

## 'కూటమి ప్రభుత్వం మహిళల్ని

# ఓటు బ్యాంకుగా కాదు



- విజన్ 2047 లక్ష్య సాధన శక్తిగా చూస్తోంది'
- మహిళలకు 33 శాతం సీట్లు కేటాయింపు ప్రకటన రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్ లాంటిదన్న మంత్రి
- మహానాడు వేదికగా వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ చేసిన ప్రకటన సామాజిక విప్లవానికి నాందిగా అభివర్ణించిన అనిత

హైదరాబాద్

ఎన్డీఏ కూటమి మహిళల్ని ఓటు బ్యాంకుగా కాకుండా విజన్ 2047 లక్ష్య సాధన శక్తిగా చూస్తోందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయింపు ప్రకటన రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్ లాంటిదని వ్యాఖ్యానించారు. ప్రతీ తెలుగుదేశం కార్యకర్త ఎంతో సెంటిమెంటుగా భావించే మహానాడు వేదికగా వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ చేసిన ప్రకటన సామాజిక విప్లవానికి నాందిగా మంత్రి అభివర్ణించారు. ఎన్టీఆర్ మహిళలకు ఆత్మగౌరవాన్ని కల్పించారని మంత్రి అనిత గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు మహిళలకు ఆర్థిక గౌరవం కల్పించారని కొనియాడారు. బిల్లుతో సంబంధం లేకుండా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం ఓ ముందడుగు వేసిందని వివరించారు. ఇతర రాజకీయ పార్టీలు తెలుగుదేశం పార్టీని అనుసరించాలని హోంమంత్రి అనిత ఈ సందర్భంగా హితవు పలికారు. "కూటమి ప్రభుత్వం వివరాలు 2లో..




### క్వాడ్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు

- చైనా విమర్శలకు భారత్ కౌంటర్
- క్వాడ్ కూటమి ఇండో పసిఫిక్‌లోని ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న భారత్
- ఏ దేశానికి వ్యతిరేకంగా కాదని వెల్లడి
- క్వాడ్ కూటమిపై చైనా విమర్శలను తిప్పికొట్టిన ఇండియా
- ఇండో పసిఫిక్ ప్రజల ప్రయోజనాల కోసం క్వాడ్

## ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు

# త్వరితగతిన చేపట్టాలి



- సీఎం చంద్రబాబు
- గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించిన సీఎం
- 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా చర్యలు
- కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు వెల్లడించిన చంద్రబాబు

హైదరాబాద్

ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి ఆ మేరకు విద్యుత్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అదే విధంగా ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు. మొత్తం 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్ జరగాలని చంద్రబాబు సూచించారు. వివరాలు 2లో..

# హైదరాబాద్ పరిధిలో ఎంఐజీ, ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి
నగరంలో నివసించే పేదల ఇళ్ల నిర్మాణానికి మరో కొత్త పనికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధి (క్యూర్)లో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్? ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఐజీ, ఎల్?ఐజీ ఫ్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్? బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పేద, మధ్యతరగతి ప్రజల కోసం లక్ష ఫ్లాట్లను నిర్మించనుంది. దీనిలో భాగంగా పైలట్? ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఎల్?ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్?, రూ. 5 లక్షల సబ్సిడీ ఇవ్వనుంది. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో వీటిని నిర్మించనున్నారు. వివరాల్లోకి వెళితే

### కోర్ పరిధిలో లక్ష ఫ్లాట్ల నిర్మాణం
తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో హౌసింగ్ బోర్డు అఫర్డబుల్ ఫ్లాట్లు నిర్మించనుంది. కేపీహెచ్‌బీ, బాగ్‌లింగంపల్లి, తదితర ప్రాంతాల్లో గతంలో చేపట్టిన విధంగా ఎల్ఐజీ, ఎంఐజీ ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనుంది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అల్పాదాయ వర్గాలకు 70 వేలు, మధ్యతరగతి ప్రజలకు 30 వేల ఫ్లాట్లు నిర్మిస్తారు.

### హౌసింగ్ బోర్డు సొంత నిధులతో నిర్మాణం
పైలట్ ప్రాజెక్టులో భాగంగా 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టనుంది. ప్రభుత్వ బడ్జెట్‌తో సంబంధం లేకుండా హౌసింగ్ బోర్డు సొంత నిధులతోనే ఈ ప్రాజెక్టులు చేపట్టనుంది. ఎల్ఐజీ యూనిట్లలో భూమిని లబ్ధిదారులకు ఉచితంగా కేటాయిస్తారు. నిర్మాణ ఖర్చులో రూ. 5 లక్షల సబ్సిడీ ఇస్తారు.

### ప్రాజెక్టు వివరాలు త్వరలో
హౌసింగ్ కమిషనర్, క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లు ఈ ప్రాజెక్టుల కోసం భూములు ఎంపిక చేసి టైటిల్ వివాదాలు, ఈసీ, రోడ్డ సదుపాయం వంటివి ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించి కేటాయించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సర్వే, నోటిఫికేషన్ల జారీ, విధివిధానాల ఖరారు వంటి అధికారాలను హౌసింగ్ బోర్డు వీసీకి ప్రభుత్వం అప్పగించింది. డబల్ బెడ్ రూం ఇళ్ల జీవోకు అనుగుణంగా టెండర్లు, ప్రొక్యూర్‌మెంట్ చేపట్టవచ్చని తెలిపింది. ఇటీవల మంత్రివర్గం తీర్మానం మేరకు గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టుల పూర్తి వివరాలను హౌసింగ్ బోర్డు త్వరలో ప్రకటించనుంది.

### తొలివిడతలో 1.32 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
అయితే ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై పలు వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలో తొలివిడలో మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. వాటిని ఇప్పటి వరకు సుమారు 1.32 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాని తెలిపారు. జూన్? నెల పూర్తయ్యేనాటికి ఇంకో 72 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. రెండో విడత ఇళ్ల పథకాన్ని జూన్ 1న ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్? రెడ్డి ప్రారంభించనున్నారు. పైగా ఈ రెండో విడతో మరి కొన్ని అవకాశం కల్పించనున్నారు. ఒక్కొక్క నియోజక వర్గానికి 2 వేల ఇళ్లు మంజూరు చేయాలనే ఇటీవల కేబినెట్? సమావేశంలో నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇవ్వనున్నారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి

-మొదటిపేజీ తరువాయి
నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు చేయాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

### గ్రీన్ ఎనర్జీ కారిడార్‌పై సీఎం సమీక్ష:
రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబు విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్?ను అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్?కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు.

### డేటా సెంటర్లకు ఉపయోగం
అంతేకాకుండా గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్?ను సరఫరా చేసేందుకు ఈ నెట్?వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌలిక సదుపాయాలు పెరిగితే ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

పీఎం సూర్యఘర్ అమలులో 4వ స్థానంలో ఏపీ: పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సొలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు.

నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రవాహ్ సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

### ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు
ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు ఏపీలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్--మే 2026 కాలంలో గరిష్ఠ డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్) ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. డబ్ల్యూఈఎఫ్ సభ్యులతో సీఎం భేటీ: వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృంద సభ్యులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. సీ4ఐఆర్ ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కో-వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై సీ4ఐఆర్ అధ్యయనం చేయనుంది. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సీ4ఐఆర్ కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. అంతేకాకుండా రిజల్ట్ ఓరియేం టేషనుతో సీ4ఐఆర్ పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని సీ4ఐఆర్ కు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో డిస్కంలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జగన్ ప్రభుత్వంలో గనులశాఖ అక్రమాలు

## రూ.2,407 కోట్ల ఒప్పందాలకు లెక్కలు చెప్పాలని ఈడీ నోటీసులు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో గనుల శాఖలో జరిగిన అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒక సంచలన ప్రకటన విడుదల చేసింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడి, ప్రైవేట్ కంపెనీలతో చేతులు కలిపి నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని ఈడీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన 3 ప్రముఖ కాంట్రాక్ట్ కంపెనీలు, వాటి నిర్వాహకుల ఇళ్లలో ఈ నెల 27న దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించినట్లు ఈడీ అధికారికంగా ప్రకటించింది. ఇసుక టెండర్ల కేటాయింపు ప్రక్రియలోనే నాటి అధికారులు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని, కొన్ని నిర్దేశిత కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూర్చేలా గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని ఈడీ తన ప్రకటనలో పేర్కొంది.

ఈ ఇసుక స్కామ్‌లో భారీ ఎత్తున నిధుల మళ్లింపు జరిగిందనే పక్కా సమాచారంతో, మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రమీూా) కింద ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. హైదరాబాద్, జయపుర, కోయంబత్తూర్ వంటి ప్రముఖ నగరాల్లోని మొత్తం 8 కీలక ప్రాంతాలలో ఏకకాలంలో ఈ దాడులు జరిగాయి. ఇసుక తవ్వకాల కాంట్రాక్టులు దక్కించుకున్న ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీసీకేసీ ప్రాజెక్ట్స్, టర్న్‌కీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీల ప్రధాన కార్యాలయాలతో పాటు, వాటితో సంబంధం ఉన్న వ్యాపారవేత్తలు బోయినపల్లి శ్రీనివాసరావు, అశోక్ కుమార్, అలాగే గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి నివాసాల్లో ఈ తనిఖీలు సుదీర్ఘంగా కొనసాగాయి.

భారీ ఎత్తున నగదు, సంపద స్వాధీనం: ఈ సుదీర్ఘ సోదాల్లో ఈడీ అధికారులు భారీ ఎత్తున నగదు, విలువైన సంపదను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో రూ.1.53 కోట్ల లెక్కల్లో లేని నగదుతో పాటు, సుమారు రూ.1.30 కోట్ల విలువైన వెండి బిస్కెట్లు, అధికారులు జప్తు చేశారు. వీటితో పాటు 1,800 డాలర్ల విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన పలు స్థిర, చరాస్తుల కీలక భూ పత్రాలు, బినామీ ఆస్తుల డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, మొబైల్ ఫోన్లను ఈడీ సీజ్ చేసింది. పర్యావరణ నిబంధనలను, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+ు) ఆదేశాలను బేఖాతరు చేస్తూ, నదీ పరివాహక ప్రాంతాల్లో అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ లోతుగా ఇసుకను తవ్వేసి తరలించారని ఈడీ నిర్ధారించింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ తవ్వకాలకు సంబంధించి సదరు కాంట్రాక్ట్ కంపెనీలకు గతంలో మైనింగ్ శాఖ జారీ చేసిన రూ.2,407 కోట్ల ఒప్పందాల ఉల్లంఘన డిమాండ్ నోటీసులపై పూర్తిస్థాయిలో లెక్కలు చెప్పాలంటూ ఈడీ అధికారులు నిందితులకు నోటీసులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ (ూజడీ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ (ఖీ×=) ఆధారంగా తాము ఈ మనీలాండరింగ్ దర్యాప్తును మరింత వేగవంతం చేసినట్లు ఈడీ స్పష్టం చేసింది.

## సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోంది

-మొదటిపేజీ తరువాయి
వచ్చిన వారితో అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గ బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ చేపట్టారు.

### సర్‌పై సమాలోచన కోసమే సమావేశం
సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని.. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బీజేపీ యత్నిస్తోందని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ టార్గెట్ చేసిందని.. కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం, సర్‌పై సమాలోచన కోసమే సమావేశం ఏర్పాటు చేశాం. సంఘటన సృజన్ అభియాన్‌లో భాగంగా నూతన డీసీసీల ఎంపిక జరిగింది. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బీజేపీ యత్నిస్తోంది. బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ లక్ష్యం."

### ప్రభుత్వమే మారిపోయిన పరిస్థితి
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్?ఐఆర్ పేరిట సెక్యులర్? ఓట్లను తొలగించే ప్రక్రియ చాలా పకడ్బందీగా చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్? కుమార్ గౌడ్? ఆరోపించారు?.బంగాల్?లో సుమారు 93 లక్షల ఓట్లను తొలగించారని తెలిపారు. అయితే అప్పీల్? చేసుకొనేందుకు కేవలం 30 లక్షల మందికి మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. సుమారు 62 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించాలని ఆరోపించారు. దీంతో ఆ రాష్ట్రంలో ప్రభుత్వమే మారిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

### నాయకులకు ప్రత్యేక శిక్షణ
ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో రేవంత్? రెడ్డి నేతృత్వంలోని పార్టీ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్లకు కాపాడుకొనేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు పూర్తి అవగాహన ఉన్న వారిని నియమించినట్లు తెలిపారు. నేతలందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ముహూర్తం ఫిక్స్..

-మొదటిపేజీ తరువాయి
అవుతున్నారు. తొలి విడతలో మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిల్లో ఇప్పటికే లక్ష ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకోగా.. వీరికి రూ.6,500 కోట్లు చెల్లించారు. తొలి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మంజూరు చేశారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తొలి విడతలో పూర్తయిన లక్ష ఇళ్లకు జూన్ 1,2వ తేదీల్లో గృహప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక తొలి విడతలో మంజూరు చేసిన వాటిల్లో మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణం కూడా తుది దశకు చేరుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. జూన్ 1వ తేదీన కొరారి గ్రామంలో 28 మంది కొలాం ఆదివాసీలు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న ఇళ్లకు రేవంత్ గృహప్రవేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొననున్నారు.

### ప్రతీ ఒక్కరికీ రూ.5 లక్షలు
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. విడతల వారీగా వీటిని నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తయ్యే కొద్ది దశలవారీగా వీటిని అందిస్తోంది. అయితే 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనంతరమే నిజమైన లబ్దిదారులకు ఇళ్లను కేటాయిస్తున్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇళ్లను మంజూరు చేస్తున్నారు. ఇక జీపీఎస్, ఏఐ టెక్నాలజీతో ఉపయోగించుకుంటూ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రవేశపెట్టారు. ఫిర్యాదులపై 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు..

## 'కూటమి ప్రభుత్వం మహిళల్ని ఓటు బ్యాంకుగా కాదు



-మొదటిపేజీ తరువాయి
మహిళల్ని ఓటు బ్యాంకుగా కాకుండా విజన్ 2047 లక్ష్య సాధన శక్తిగా చూస్తోంది. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయింపు ప్రకటన రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్ లాంటిది. ప్రతీ తెలుగుదేశం కార్యకర్త ఎంతో సెంటిమెంటుగా భావించే మహానాడు వేదికగా వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ చేసిన ప్రకటన సామాజిక విప్లవానికి నాందిగా భావించవచ్చు. బిల్లుతో సంబంధం లేకుండా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం ఓ ముందడుగు వేసింది" -వంగలపూడి అనిత, హోంశాఖ మంత్రి రాష్ట్ర పురోగతిలో ఇదో ముందడుగన్న ఎమ్మెల్యే శ్రావణి: మహానాడు వేదిక ద్వారా 33 శాతం మహిళా బిల్లు రిజర్వేషన్ తీర్మానించినందుకు అనంతపురం జిల్లా మహిళల తరపున సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్?లకుసింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ స్థాపించినప్పటి నుంచి మహిళ లోకానికి పెద్ద పీట వేస్తోందనటానికి మరో నిదర్శనం అన్నారు. ఆనాడు నందమూరి తారక రామారావు ఆస్తిలో సగభాగం మహిళలకు కేటాయించేలా తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఇవాళ రాష్ట్ర అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ఉండాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్? 33 శాతం రిజర్వేషన్ బిల్లును తీర్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంధన పొదుపులో భాగంగా వర్చువల్ విధానంలో డిజిటలైజేషన్ అభివృద్ధి కోసం మహానాడు నిర్వహించటం ఎంతో గర్వించదగ్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి కొనియాడారు. దేశంలోనే రాష్ట్ర పురోగతి, అనేక అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్యే శ్రావణి పేర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రశ్నించినందుకు మహిళలని చూడకుండా అనేక విధాలుగా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఎన్నో చూసామన్నారు. ఈనాడు మహిళల అభివృద్ధి కోసం ఈ రిజర్వేషన్ కల్పించటాన్ని అనంతపురం జిల్లా మహిళల తరపున స్వాగతిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రి నారా లోకేశ్?కు ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలుపుతున్నామన్నారు.

### టీడీపీ హయాంలోనే గుర్తింప
తెలుగుదేశం మహానాడులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కింద రాజకీయ పదవులు కేటాయిస్తామని చేసిన తీర్మానం పట్ల అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో తెలుగు మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రం వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ రెడ్డి అనంత కుమారి తదితరులు సమావేశమై ఈ సందర్భంగా అందరికీ మిఠాయిలను పంచారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలని మహిళాసమాజమంతా నినాదాలు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే గుర్తింపు వచ్చిందని మహిళలంతా సంతోషం వ్యక్తం చేశారు.

# మీసేవ కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన..

స్థానికుల ధర్నాకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మద్దతు..



**ఎల్బీనగర్, మే 29, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్ పరిధి వికాస్‌నగర్‌లో ఉన్న మీసేవ కేంద్రంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను మీసేవ కార్యాలయంగా వినియోగించాలన్న జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖ నిర్ణయాలపై కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. వికాస్‌నగర్ లోని మీసేవ కేంద్రం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఆ భవనంలో మీసేవ కేంద్రం, గ్రంథాలయం, వార్డు కార్యాలయాలు కొనసాగుతున్నాయని, వాటిని తొలగించి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రయత్నించడం ప్రజల్లో ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు పెరిగి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలకు సేవలందిస్తున్న కార్యాలయాలను తొలగించడం సమంజసం కాదన్నారు. న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న సీనియర్ సిటిజన్స్ భవనాన్ని మీసేవ కార్యాలయానికి కేటాయిస్తే వృద్ధులకు కాలక్షేపానికి స్థలం లేకుండా పోతుందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భవనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు వినియోగించకుండా సీనియర్ సిటిజన్స్‌కే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ సమీపంలోని ఎల్బీనగర్ టిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ కోసం 3 వేల గజాల స్థలం కేటాయించారని గుర్తుచేశారు. అక్కడ నిర్మాణం చేపట్టకుండా ప్రస్తుతం ప్రజలకు ఉపయోగపడుతున్న భవనాలను ఖాళీ చేయించడం సరికాదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు పునరాలోచన చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, త్రివేది, నర్సిరెడ్డి, శివప్రకాష్, నాగలక్ష్మి, సుష్మిత, రోజా పద్మిని, లక్ష్మీనారాయణ, వెంకటేష్, శోభారాణి, శ్రీనివాసచారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు..

## అన్నదాన కార్యక్రమాలు..



**న్యూస్ ఇండియా పల్నాడు జిల్లా గణపవరం మరియు చిలకలూరిపేట** పట్టణంలో ఘనంగా ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో జిల్లా తెలుగు యువత నాయకులు నన్నపనేని టరీష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం గ్రామంలోని తులసి వృద్ధాశ్రమం మరియు చిలకలూరిపేట పట్టణంలోని ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నెల్లూరి సదాశివరావు మాట్లాడుతూ.. ప్రత్తిపాటి పుల్లారావు నిరాడంబర జీవితం గడుపుతూ పేదల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. నన్నపనేని టరీష్ మాట్లాడుతూ.. పేదలకు కంటి వెలుగు ప్రసాదిస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తూ, ప్రజల కష్టసుఖాలే తన ధ్యేయంగా భావించే నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరు సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, కుమీర్, ఆరేమల్లి, రియాజ్, పోపూరి అజయ్, అమరమణి, పెదవల్లి రామారావు, శరత్ తదితరులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సొంతింటి పథకం రుణం రూ.30 లక్షలకు పెంచాలి

- కంపెనీ మెయిన్ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చాలి
- కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేయండి
- సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారు పేరు కేసులను పరిష్కరించాలి
- సంస్థ పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలి
- కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం(న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 29** సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం వడ్డీ లేని గృహ సాయం రూ.10 లక్షల నుండి రూ.30 లక్షలకు పెంచాలని, 250 చదరపు గజాల ఇంటి స్థలాలతో కూడిన "సొంత ఇళ్ల పథకాన్ని" ప్రవేశపెట్టి అమలు చేయాలనీ, కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి పనులతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చడం ద్వారా కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ప్రాంతాల కార్మికులతో పాటు ఇతర ఏరియాల కార్మికులకు మెరుగైన వైద్యం అందుతుందని, అలాగే కొత్తగూడెంలో నూతన ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల నుండి రూ.14.00 కోట్లు మంజూరు చేయాలని కోరామన్నారు. సంస్థలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారు పేరు కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అధికారుల పీఆర్‌పీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పిస్తూ తక్షణమే క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని, కొత్తగూడెం నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని, బస్ స్టాండ్ నుండి త్రిమాత టెంపుల్ వరకు, హెడ్ ఆఫీస్ నుండి మెయిన్ హాస్పిటల్ వరకు లైటింగ్ ను సంస్థద్వారా తక్షణమే పనులు ప్రారంభించాలని, పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి హేమచంద్రాపురం రోడ్డును ఫోర్-లేన్‌గా మార్చాలని, 14వ వార్డు రామాలయం నుండి ఎన్ హెచ్-30 వరకు రోడ్డు అభివృద్ధికి సహకరించాని కోరామన్నారు. బాబు క్యాంప్, రామావరంలో బీటీ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని, పాత దుకాణాల స్థానంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. లీజు భూములను మున్సిపాలిటీకి అప్పగించాలని, ఉద్యోగుల బదిలీల అభ్యర్థనలను పరిశీలించాలని, పెర్క్స్ పై ఆదాయపు పన్నును రీయింబర్స్ చేయాలన్నారు. సింగరేణి బలోపేతానికి కొత్త బొగ్గు ప్రాజెక్టులు కేటాయించాలని, దివంగత జేటీఓ చల్లా రాజా శ్రీనివాస్ కుమారుడు, వినికిడి లోపం గల చల్లా భరద్వాజ్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరామని, తన ప్రతిపాదనలపై సిఎండి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# వరుసగా ఏడు రోజులు సెలవు ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటి

**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)** వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వారు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా సమస్త రైతు సోదరులకు, వ్యాపారస్తులందరికి, గుమాస్తా, దడవాయి మరియు కార్మిక సోదరులకు తెలియజేయునది ఏమనగా,రోహిణి కార్తీ ఎండల తీవ్రతతో రాష్ట్రంలో విపరీతముగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందున మరియు రాష్ట్ర ప్రభుత్వం ఉష్ణోగ్రత వేడిని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరినందున మార్కెట్ కార్మిక సంఘాలు మరియు ఛాంబర్ అన్ని సెక్షన్ల విజ్ఞప్తి మేరకు తేదీ. 01.06.2026 నుండి 06.06.2026 వరకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ వారు లేఖ ద్వారా మార్కెట్ బందు కోరినారు. తేదీ.07.06.2026 ఆదివారం వారాంతపు సెలవు. పై సందర్భములను పురస్కరించుకొని సోమవారం నుండి ఆదివారం వరకు వరసగా (7)రోజులు మార్కెట్ బందు ఉండగలదు. తిరిగి తేది. 08.06.2026 సోమవారం రోజున మార్కెట్ పునఃప్రారంభమగును.కావున పై విషయమును రైతు సోదరులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను పైన తెలిపిన బందు రోజులలో తమ సరుకులను మార్కెట్నుకు తరలించి ఇబ్బందులకు గురి కావద్దని తెలియజేసినారు.ఇట్టి విషయంలో రైతు సోదరులు మార్కెట్ కమిటితో సహకరించగలరని కోరనైనది .

# ఉద్యోగుల పొట్టకొట్టి.. బోర్డు తిప్పేసిన హాస్పిటల్!






**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 29, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఉద్యోగులకు మూడు నెలల జీతాలు ఇవ్వకుండా ఆస్పత్రి మూసివేసిన ఘటన ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో వెలుగుచూసింది. బీఎన్‌రెడ్డి నగర్‌లో నిర్వహిస్తున్న నీలాద్రి హాస్పిటల్ యాజమాన్యం సిబ్బందికి జీతాలు చెల్లించకుండా ఆస్పత్రికి తాళం వేసిందని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న దాదాపు 60 మంది సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వారు వాపోయారు. "హాస్పిటల్‌ను మరోచోటికి మారుస్తున్నాం.. ఇకపై రావాల్సిన అవసరం లేదు" అంటూ యాజమాన్యం ఒక్కసారిగా చెప్పిందని, కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి కూడా సరైన సమయం ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మార్చిలోనే ఆస్పత్రి మూసివేసినా ఇప్పటి వరకు తమకు రావాల్సిన జీతాలు చెల్లించలేదని తెలిపారు. యాజమాన్యంపై విసుగు చెందిన కొందరు ఉద్యోగులు ఆస్పత్రి భవనంలోనే వంట చేసుకుని నిరసన తెలపడంతో ఉద్రిక్తత నెలకొంది. "నా బిల్డింగ్‌లో ఎందుకు వంట చేస్తున్నారు" అంటూ భవన యజమాని వారు వండుకున్న అన్నాన్ని నేలకూల్చేశారని ఉద్యోగులు ఆరోపించారు. హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, హాస్టళ్లలో ఉంటున్న కొందరిని ఫీజులు చెల్లించలేదని బయటకు పంపిస్తున్నారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, నీలాద్రి హాస్పిటల్‌పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదే యాజమాన్యానికి హయత్‌నగర్‌లో మరో ఆస్పత్రి కూడా ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎల్బీనగర్ పరిధిలో అనుమతులు, పార్కింగ్ సౌకర్యాలు లేకుండా నడుస్తున్న ఆస్పత్రులు అనేకం ఉన్నాయని స్థానికులు అంటున్నారు. కొందరు ఆస్పత్రుల్లో కేవలం ఒక జనరల్ ఫిజీషియన్‌ను మాత్రమే ఉంచి, మిగతా వైద్య సేవలను ఇతర డాక్టర్ల సలహాలతో నిర్వహిస్తూ, కార్పొరేట్ స్థాయిలో బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఉద్యోగులకు మాత్రం జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితులు అంటున్నారు. ఒకే భవనంలో పేర్లు, యాజమాన్యాలు మారుస్తూ ఆస్పత్రులు కొనసాగుతున్న ఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ఆస్పత్రులపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఫ్రూట్ మార్కెట్ భూముల విషయంలో రైతులకు న్యాయం చేయాలి..

కలెక్టర్‌కు వినతి చేసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్, మే 29, న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కోహెడ గ్రామంలో ప్రతిపాదిత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే కేటాయించిన భూమిని పక్కనబెట్టి, ప్రస్తుతం సర్వే నంబర్ 167/1లో సుమారు 264 ఎకరాల భూమిని సేకరిస్తున్నారని తెలిపారు. ఈ భూములపై ఆధారపడి సుమారు 160 మంది రైతులు జీవనం సాగిస్తున్నారని, భూములు కోల్పోతామన్న ఆందోళనతో వారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా సరైన నష్టపరిహారం అందించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. వచ్చే నెల 3వ తేదీన ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో, అంతకుముందే రైతుల భవిష్యత్ భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా సమస్యపై ప్రశ్నిస్తున్న రైతులపై అరెస్టులు, బెదిరింపులు, దాడుల వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు.

# మేడ్చల్ జిల్లా భట్రాజు మహిళా, యువజన సంఘం పడమర శాఖ నూతన కమిటీల ఎన్నిక....

**కుత్బుల్లాపూర్ మే 29**
**(న్యూస్ ఇండియా ప్రతినిధి )**
మేడ్చల్ జిల్లా భట్రాజు మహిళా, యువజన సంఘం (పడమర శాఖ) నూతన కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని కృషి హై స్కూల్ లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూరపాటి కరుణాకర్ రాజు, లోలబట్టు కృష్ణంరాజుల సమక్షంలో జరిగిన ఎన్నికల్లో మహిళా సంఘం నూతన కమిటీ సభ్యులుగా ఏనుగుధాటి పరమేశ్వరిని అధ్యక్షురాలుగా, కూరపాటి పద్మావతి, ఉడిముడి సత్యవాణిలను ఉపాధ్యక్షులుగా, వినుకొండ హరిణిని ప్రధాన కార్యదర్శిగా, కల్వరాల బట్టు లావణ్యను సంయుక్త కార్యదర్శిగా, తంగెళ్ళ సుజాతను కార్యనిర్వాహక కార్యదర్శిగా, భల్లం ఉషారాణిని కోశాధికారిగా, వడాలి సీత, వ్యాసభట్టు సంతోషిలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. యువజన సంఘం నూతన కమిటీ సభ్యులుగా భల్ల కరుణాకర్ రాజును అధ్యక్షునిగా, సరస్వతి గిరిధర్ రాజును ఉపాధ్యక్షునిగా, వరకవి సురేందర్ రాజును ప్రధాన కార్యదర్శిగా, తంగెళ్ల ప్రేమ్ సాయి భట్, ఉడుమూడి సాత్విక్ వర్మ, బొల్లేపల్లి నాగరాజులను కార్యదర్శులుగా, భల్లం మౌనిక సాయిని




కార్యనిర్వాహక కార్యదర్శిగా, సరస్వతి నిఖిల్ రాజు, నన్నపురాజు సాయికిరణ్ రాజు, వ్యాసభట్టు యశ్వంత్ రాజులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు చక్రాల రేవతి నంద్ భట్, జిల్లా ఉపాధ్యక్షులు తంగేళ్ల రాధాకృష్ణ భట్, వి. రాఘవ రాజు, కే. వెంకటేశ్వర రాజు, బి. కృష్ణార్జున రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పోరంకి శ్యామ్ ప్రసాద్ రాజు, కార్యదర్శి డి. దురేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడమే మోడీ ధ్యేయం

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నేత గౌని**

**భద్రాద్రి కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి )మే 29:**వ్యవసాయ రంగాన్ని మొత్తం కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పడం కోసమే నూతన చట్టాలను తీసుకొస్తుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పాల్వంచ మండల మహాసభ శు క్రవారం రెడ్డిగూడెంలో కళింగ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభకు ముఖ్య వక్తగా గౌని నాగేశ్వరావు పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో నరేంద్ర మోడీ వచ్చక వ్యవసాయ రంగాన్ని ప్రధాన టార్గెట్ చేస్తూ నిర్వీర్యం చేస్తున్నాడని వ్యవసాయ రంగాన్ని మొత్తం కూడా దాని మీద ఉన్నటువంటి హక్కుల్ని మొత్తం కూడా కార్పొరేట్ శక్తులకి అవకాశాలు కల్పిస్తున్నాడని ఆయన అన్నారు. ఈరోజు భారతదేశంలో మనం పండించే పంటలు ఉదాహరణకు పత్తి ఎంత పండించాలా, ఏఏ పంటలు వేయాలి,ఏ ఏ పంటలు పండించాలి అనేది కూడా నరేంద్ర మోడీ అమెరికా చెప్పినట్టుగా మనపై రుద్దుతున్నాడని అన్నారు. దేశంలో రైతులు గతంలో దేశంలో రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందులు




ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఇప్పటికే రైతులు పండించిన పంటలు మొత్తం కూడా తడిసి మార్కెట్లో నిలువ చేసుకొని అమ్ముడుపోక బయట దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి గవర్నమెంట్ ఏ కల్పిస్తుందని కొనుగోలు కేంద్రాలు లేవని, గిట్టుబాటు ధర లేదని, కొనే నాధుడే లేకుండా దళారీలను పెంచి పోషిస్తున్నారని వారు అన్నారు. తక్షణమే రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ఈ మహాసభకు ముందుగా జెండా ఆవిష్కరణ కందాల బుచ్చిరెడ్డి చేయగా, అమరవీరుల సంతాప తీర్మానం కార్యదర్శి నివేదికను కామ్రేడ్ ఉప్పరబోయిన రామ్మూర్తి ప్రవేశపెట్టారు.
ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పరబోయిన రామ్మూర్తి,కళింగ రెడ్డి,బుచ్చిరెడ్డి, బత్తుల నాగరాజు,కొమరం మల్లేష్, తూము రాజయ్య,ముత్తమ్మ మణెమ్మ,అంజలి, యాకయ్యతదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి





- **మోయలేని భారాలతో ఆటో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నం చేస్తున్న కేంద్రం**
- **కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు**
- **కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు ధరలు పెంచి నడ్డి విరిచిన ఎన్డీయే సర్కార్**
- **స్వయం ఉపాధిపై ఆధారపడిన పేదలను నట్టేట ముంచుతున్న మోడీ**
- **నిత్యం పెరుగుతున్న ఇంధన ధరలపై పోరాటాలు ఉధృతం చేస్తాం**
- **ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య**
- **ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అర్ధ నగ్నంగా, ఆటోలను లాగుతూ విన్నూత నిరసన**

**కొత్తగూడెం(న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 29:** అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఆటో కార్మికులు శుక్రవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు అర్ధ నగ్నంగా ఆటోలకు తాడుకట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోయలేని భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నట్టేట ముంచుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు డీజిల్ ధర పెంచి ఆటో కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. లాక్‌డౌన్ కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆటో కార్మికులను ఈ ధరల పెరుగుదల మరింత కుంగదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాలను తగ్గించి, కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మర్రి కృష్ణ, అబ్బులు, మంద శ్రీను, బాబు జానీ, ఆరెల్లి, కృష్ణ, రాంబాబు, దేశి, బడుగు భాస్కర్, చింటూ, లక్ష్మణ్, సంపత్, విజ్జి, మండల రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై పోలీసుల దాడి

**భద్రాద్రి కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 29**:పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాండురంగాపురం గ్రామానికి సమీపంలో ఉన్న పామాయిల్ తోటలోని పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. 7 గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఒక న్యాయవాది ఉన్నట్లుగా సమాచారం. వారి వద్ద నుండి రూ 26 వేల 40, 3 ద్విచక్ర వాహనాలను, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పాల్వంచ రూరల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

## గోల్కొండ నుండి టూంబ్స్ వరకు రోప్ వే...

**హైదరాబాద్, మే 29, న్యూస్ ఇండియా తెలుగు:** :సాధారణంగా రోప్‌వేలు కొండలు, పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తాయి. కానీ ఇకపై హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రజా రవాణాకు, పర్యాటక రంగానికి ఉపయోగపడేలా సరికొత్త ప్రణాళిక సిద్ధమవుతోంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి మాస్ ట్రాన్సిట్ పద్ధతిలో రోప్‌వేలను అందుబాటులోకి తెచ్చేందుకు వారణాసి నమూనాను ఇక్కడ పరిశీలిస్తున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ దీనికి సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తోంది. ప్రభుత్వానికి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు గాను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో ఈ ప్రాజెక్టులను నిర్మించాలని భావిస్తున్నారు. నగరంలోని మెట్రో, రైల్వే స్టేషన్ల నుండి సమీప వాణిజ్య, వ్యాపార సముదాయాలకు , పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ ఒక
రోప్‌వే సర్క్యూట్ ఏర్పాటు చేయడం ఇందులో కీలకమైన అంశం.నగరంలో తొలుత ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ పక్కనే ఉన్న టూంబ్స్ వరకు సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో రోప్‌వే ఏర్పాటుకు హెచ్ఎండీఏ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అక్కడి నుండి జూ పార్క్ వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర ఏరియల్ వ్యూ (ఆకాశ మార్గం) రోప్‌వేతో అనుసంధానం చేసే వీలుంది. ట్యాంక్‌బండ్ నుండి సంజీవయ్యపార్క్ వరకు కూడా రోప్‌వేను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.ప్రైవేటు ఆస్తుల పైనుంచి ఈ రోప్‌వే మార్గాలు వెళ్లేటప్పుడు బాధితులకు తగిన పరిహారం అందించేలా పాలసీలో మార్పులు కోరుతూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కేంద్ర రక్షణ శాఖ (రూజా) పరిధిలోని ప్రాంతాల నుండి క్లియరెన్స్ కోసం హెచ్ఎండీఏ ప్రయత్నాలు చేస్తోంది. అక్కడి నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి.దేశంలోనే తొలి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రోప్‌వే వ్యవస్థ వారణాసిలో రూపొందుతోంది. అక్కడ కంటోన్మెంట్ రైల్వే స్టేషన్ నుండి గోడోలియా చౌక్ వరకు 3.8 కిలోమీటర్ల మేర 5 స్టేషన్లతో పనులు జరుగుతున్నాయి. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ వల్ల 45 నిమిషాల నుండి గంట సమయం పట్టే ఈ దూరాన్ని, రోప్‌వే ద్వారా కేవలం 16 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. దీని ద్వారా రోజుకు 96 వేల మంది ప్రయాణించేలా డిజైన్ చేశారు. హైదరాబాద్‌లో కూడా వానాకాలంలో చిన్న దూరాలకు (2-3 కి.మీ) తీవ్ర ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతుంటాయి. ఇలాంటి తక్కువ దూరాల ప్రయాణానికి రోప్‌వేలు ఎంతో మేలని నిపుణులు చెబుతున్నారు. భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, సామాన్యులకు అందుబాటులో ఉండేలా టికెట్ ధరలను నిర్ణయిస్తే ఈ ప్రాజెక్టు నగరవాసులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుంది.

**గరంలో ప్రతిపాదిత రూట్లు:**
గోల్కొండ టు టూంబ్స్: ముందుగా నగరంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ నుంచి కుతుబ్ షాహీ టూంబ్స్ వరకు 2 కిలోమీటర్ల మేర రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు.గోల్కొండ నుంచి జూ పార్క్: గోల్కొండ ప్రాంతం నుండి నెహ్రూ జూ పార్క్ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర ఏరియల్ వ్యూతో రోప్‌వేలను అనుసంధానం చేసే అవకాశం ఉంది.ట్యాంక్‌బండ్-సంజీవయ్య పార్క్: హుస్సేన్ సాగర్ పరిసరాల్లో ట్యాంక్‌బండ్ నుంచి సంజీవయ్య పార్కు వరకు కూడా రోప్‌వే నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి.ఐటీ కారిడార్: నగరంలోని ఐటీ హబ్ (హైటెక్ సిటీ, గచ్చిబౌలి) ప్రాంతాల్లో కూడా దీని సేవలను వాడుకునే వీలుంది.
అనుమతులు: ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కోసం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రక్షణ శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ల కొరకు హెచ్ఎండీఏ ప్రయత్నిస్తోంది.
రోప్‌వే వల్ల కలిగే ప్రయోజనాలు:

**సమయం ఆదా:**
ఇప్పటికే వారణాసిలో రోప్‌వేలు అందుబాటులో ఉండగా.. అక్కడ రోడ్డు మార్గంలో 45 నిమిషాల నుంచి గంట పట్టే ప్రయాణ సమయం.. ఈ రోప్‌వే ద్వారా కేవలం 16 నిమిషాలకే తగ్గిపోతోంది. ఇదే విధంగా హైదరాబాద్‌లో కూడా 2-3 కిలోమీటర్ల తక్కువ దూర ప్రయాణాలకు ఇది ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ట్రాఫిక్, వర్షాల కష్టాలకు చెక్:**
హైదరాబాద్ నగరంలో నిత్యం ఉండే ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు, వానాకాలంలో రోడ్లపై నిలిచే నీటి వల్ల పడే ఇబ్బందుల నుంచి వాహనదారులకు పూర్తి స్థాయిలో ఉపశమనం లభిస్తుంది.

**సామాన్యుడికి అందుబాటులో:**
భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూనే.. టికెట్ రేటును సామాన్యులకు అందుబాటు ధరలో ఉంచితే ఈ ప్రాజెక్టు అద్భుతమైన విజయం సాధిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సర్కారు దవాఖానాల ఆవరణలో ప్రైవేటు మెడికల్ షాపుల దందా

**హైదరాబాద్, మే 29, న్యూస్ ఇండియా తెలుగు:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ, ప్రధాన సర్కారు దవాఖానాల ఆవరణలో ప్రైవేటు మెడికల్ షాపుల దందా యథేచ్ఛగా సాగుతోంది. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక ఆసుపత్రులలో టెండర్లు లేకుండానే, లీజు గడువు ముగిసినా పాతవారే దుకాణాలను కొనసాగిస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వైద్యారోగ్య శాఖ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, రోగులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది.గాంధీ ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుతం మూడు ప్రైవేటు మెడికల్ షాపులు నడుస్తున్నాయి. వీటి లీజు గడువు ఎప్పుడో ముగిసిపోయింది. నిబంధనల ప్రకారం ప్రతి రెండు, మూడేళ్లకు కొత్తగా టెండర్లు పిలిచి దుకాణాలను కేటాయించాల్సి ఉండగా.. ఇక్కడ గత పదేళ్లుగా టెండర్లు లేకుండానే పాతవారే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ దుకాణాలకు పదేళ్ల క్రితం నామమాత్రపు అద్దెలను నిర్ణయించారు. ఒక్కో షాపు రోజుకు దాదాపు రూ. లక్ష వరకు వ్యాపారం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన నామమాత్రపు అద్దెలను కూడా సకాలంలో కట్టడం లేదు. ఇలా గాంధీ ఆసుపత్రికి రావాల్సిన అద్దె బకాయిలు సుమారు రూ. 3 కోట్ల వరకు పేరుకుపోవడం గమనార్హం. ఒక్కో దుకాణదారుడి నుండి రూ. లక్షల బకాయిలు ఉన్నా వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు ఏటా రోగుల రద్దీ 20 నుండి 25 శాతం పెరుగుతోంది. దానికి తగ్గట్లుగా బడ్జెట్ నిధుల నుండి మందుల కేటాయింపులు పెరగడం లేదు. ప్రభుత్వం కేవలం 80 శాతం మందులను మాత్రమే సరఫరా చేస్తుండగా, మిగిలిన 20 శాతం అత్యవసర మందులను ఆసుపత్రి బడ్జెట్ నుంచి కొనాల్సి వస్తోందిఅయితే రోగుల సంఖ్యతో పోలిస్తే మందుల సరఫరా తక్కువగా ఉండటం వల్ల, వైద్యులు రాసే అన్ని మందులను ప్రభుత్వ ఫార్మసీలు అందించలేకపోతున్నాయి. వైద్యులు రాసే ఆరు రకాల మందులలో కేవలం నాలుగు లేదా మూడు రకాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. ఈ కొరతను ప్రైవేటు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రోగులు విధిలేని పరిస్థితుల్లోఆసుపత్రి ఆవరణలోని ప్రైవేటు షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. కొందరు వైద్యులకు, ప్రైవేటు మందుల దుకాణాలకు మధ్య లోపాయికారీ అవగాహన ఉందనే ఆరోపణలు కూడా ఉన్నాయి.నిమ్స్
ఆసుపత్రిలో ప్రైవేటు మెడికల్ షాపుల నిర్వాహకులు మరింత బరితెగిస్తున్నారు. ఇటీవల నిమ్స్‌లో మందులు కొనడానికి వచ్చిన ఒక యువతి కుటుంబ సభ్యులను, తమ షాపులోనే మందులు కొనాలంటూప్రైవేటు దుకాణదారులు ఒత్తిడి తెచ్చారు. దీనిపై ఆమె నిలదీయడంతో సదరు వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. వైద్యులు రాసిన మందులు కాకుండా, తమకు ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే వేరే కంపెనీల(ఫార్ములా) మందులను రోగులకు అంటగడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రపంచ రాజకీయాల్లో భయానక పోకడ మళ్లీ తలెత్తింది. అది బ్రింక్‌మన్‌షిప్.. అంచుదాకా వెళ్లే దూకుడు వ్యూహం! ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయడం, దానికి ప్రతిగా అమెరికా ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధించడం –ఈ రెండు చర్యలూ ప్రపంచాన్ని మరోసారి యుద్ధం అంచుకు తెచ్చాయి. శీతల యుద్ధకాలంలో పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు.. 1948–49 నాటి బెర్లిన్ దిగ్బంధన సంక్షోభం, 1962 నాటి క్యూబా క్షిపణి సంక్షోభం ఘటనలను విశ్లేషిస్తూ ఈ భావనను నిర్వచించారు. సంఘర్షణ లేదా యుద్ధానికి తక్కువస్థాయి పరిస్థితుల్లో, శత్రువును చర్చల బల్ల దగ్గరకు లేదా రాజీకి లేదా తార్కికంగా మూర్ఖత్వంగా కనిపించే నిర్ణయానికి నెట్టడానికి ఒకే ఒక చర్య లేదా పరంపరగా జరిగే చర్యలు తీసుకోవడమే బ్రింక్‌మన్‌షిప్. ఇందులో అంతర్లీనంగా ఉండే ప్రమాదమేమిటంటే, ఒకసారి ఎస్కలేషన్ మెట్లు ఎక్కడం మొదలుపెట్టాక, అది అణ్వాయుధ విపత్తు వరకూ అదుపు తప్పి వెళ్ళవచ్చు. శీతల యుద్ధం ముగిసినా, అణ్వాయుధాల నీడ తొలగిపోలేదు. పైగా సంఘర్షణల స్వభావం మరింత విస్తృతమైంది, సంక్లిష్టమైంది! అందుకే ఈ అంచుదాకా వెళ్లే వ్యూహం నేడు మరింత ప్రమాదకరమైన రూపాలు దాల్చింది.

బ్రింక్‌మన్‌షిప్ ఇప్పుడు అనేక రూపాల్లో ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. మొదటిది –తీవ్రవాద బ్రింక్‌మన్‌షిప్. ఉగ్రవాదం ఒక ముఖ్యమైన ముందస్తు వ్యూహంగా మారింది. అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్‌వంటి సంస్థలు ప్రభుత్వాలను రెచ్చగొట్టి అసమానమైన ప్రతిస్పందన రాబట్టడానికి దాడులు చేశాయి. అయితే ఈ వ్యూహం వారికి ఫలితాలివ్వలేదు. అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ తమ లక్ష్యాలను సాధించలేదు. ఐర్లాండ్‌లో ఐఆర్ఏ, అల్జీరియాలో ఎఫ్ఎల్ఎన్ మాత్రం బలమైన శత్రువులను రాజీకి నెట్టిన అరుదైన మినహాయింపులు. రెండవది –ప్రాక్సీ బ్రింక్‌మన్‌షిప్. పాకిస్తాన్, ఇరాన్ నాలుగు దశాబ్దాలుగా ప్రాక్సీ సంస్థలను ఉపయోగించి బలమైన శత్రువులను అలసిపోయేలా చేసే అసమాన వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై జరిపిన దాడి ఇదే కోవకు చెందిన బ్రింక్‌మన్‌షిప్. దానికి ఇజ్రాయెల్ గాజాలో జరిపిన అసమానమైన ప్రతిదాడి –ఇది నిరోధశక్తి పూర్తిగా విఫలమైనప్పుడు ఎస్కలేషన్ మెట్లు ఎంత వేగంగా ఎక్కవచ్చో చెప్పే ఉదాహరణ. మూడవది –అగ్రదేశాల బ్రింక్‌మన్‌షిప్. అమెరికా సాధారణంగా నేరుగా బలప్రయోగం లేదా ఆర్థిక బలవంతాన్ని ఇష్టపడుతుంది. కానీ ఇరాన్‌ను చర్చల బల్ల దగ్గరకు తీసుకొచ్చే ప్రయత్నంలో దిగ్బంధన రూపంలో బ్రింక్‌మన్‌షిప్‌కు దిగింది. ఇరాన్ మాత్రం హార్మూజ్ జలసంధిని మూసివేసే అసమాన వ్యూహంతో అమెరికాకు తగిన సమాధానమిచ్చింది. ఒక్క చర్యతో ప్రపంచ చమురు సరఫరాను ప్రభావితం చేయగలిగిన ఈ వ్యూహం ఇరాన్‌కు అసమానమైన లాభాన్నిచ్చింది. ఇరు పక్షాలూ మధ్యేమార్గాన్ని అన్వేషించే వరకు.. ఈ ఆట ఎక్కడ ముగుస్తుందో అనుమానమే!

రష్యా విషయంలో చూస్తే, నాటో తూర్పువైపు విస్తరిస్తోందని ఆగ్రహంతో 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. ఉక్రెయిన్ తలవంచుతుందని అంచనా వేసిన పుతిన్ లెక్కలు తప్పాయి. నాలుగేళ్లు గడిచినా యుద్ధం ముగింపు కనిపించట్లేదు.


## దౌత్యం అడుగంటినవేళ..

పుతిన్ అప్పుడప్పుడూ అణ్వాయుధ సంయమనంపై హెచ్చరికలు జారీ చేయడం శీతల యుద్ధ కాలపు భయాందోళనను తిరిగి జీవింపచేస్తోంది. కీవ్‌వంటి జనావాస ప్రాంతాలపై హైపర్‌సోనిక్ క్షిపణులు, ఏరియా వెపన్స్ విచక్షణారహితంగా ప్రయోగించడం –ఇది మరింత తీవ్రమైన ప్రతిస్పందనలకు దారి తీసే అంచు వ్యూహ శృంఖలాన్ని సృష్టిస్తోంది. చైనా విషయంలో చూస్తే, 2006 నుంచి దక్షిణ చైనా సముద్రంలో పెద్ద పెద్ద ప్రాంతాలపై సార్వభౌమత్వాన్ని చాటుకోవడానికి నియంత్రిత బ్రింక్‌మన్‌షిప్‌ను అత్యంత నేర్పుగా ప్రయోగించింది. బలహీన పొరుగు దేశాలను బెదరించే ఈ వ్యూహానికి జపాన్, తైవాన్ తప్ప మరే దేశమూ గట్టిగా ఎదురు నిలవలేకపోయింది. 21వ శతాబ్దంలో అంచు వ్యూహాన్ని అత్యంత పరిపూర్ణంగా అమలు చేసిన దేశమంటే అది ఉత్తర కొరియా. అభివృద్ధిలో వెనుకబడ్డ ఆ దేశం క్షిపణి, అణ్వాయుధ శక్తి ద్వారా అమెరికాను కూడా నియంత్రణలో ఉంచగలుగుతోంది. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశాన్నే చెస్ బోర్డ్‌పై తన పావులతో నియంత్రిస్తున్న ఈ చిన్న దేశం బ్రింక్‌మన్‌షిప్‌లో చాంపియన్.

## సంపాదకీయం

ఈ నేపథ్యంలో భారతదేశం వైఖరి ప్రత్యేకంగా నిలుస్తుంది. భారత వ్యూహాత్మక జన్యువులో సంయమనం, బాధ్యత, పరిమిత బలప్రయోగం అంతర్లీనంగా ఉన్నాయి. అత్యంత తీవ్రమైన రెచ్చగొట్టే చర్యల మధ్య కూడా భారత్ బ్రింక్‌మన్‌షిప్‌కు దిగే ప్రవృత్తిని నిరాకరించింది. పాకిస్తాన్ మద్దతుతో జరిగే సరిహద్దు ఉగ్రవాద దాడులు, చైనా సరిహద్దు అతిక్రమణలు –ఏ పరిస్థితిలోనూ భారత్ అదుపు తప్పలేదు. ఇది బలహీనత కాదు, పరిణతి చెందిన వ్యూహాత్మక సంస్కృతి. కాని, ప్రపంచం మారుతున్న తీరు చూస్తే.. సంయమనం ఎంతకాలమన్న ప్రశ్న తలెత్తుతోంది.

అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో –దౌత్యం ఎంత క్లిష్టమైన సమస్యలకైనా పరిష్కారం కనుగొనగలిగే మార్గంగా భావించేవారు. కానీ ఈ నమ్మకం నేడు డోలాయమానం. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అట్టడుగున పడిపోతున్నాయి. నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ అపహాస్యం పాలవుతోంది. బలవంతం, బెదిరింపు, అంచుదాకా వెళ్లే దూకుడు వ్యూహాలే నేడు సంఘర్షణ పరిష్కారానికి ముందు వరుసలో నిలుస్తున్నాయి. బ్రింక్‌మన్‌షిప్ అనేది తెలివైన వ్యూహం కావచ్చు. కానీ అది నిప్పుతో ఆడే ఆట. క్యూబా క్షిపణి సంక్షోభంలో ప్రపంచం అణు విపత్తు అంచు దాకా వెళ్ళి తిరిగి వచ్చింది. అది కేవలం అదృష్టం. అదే అదృష్టం ప్రతిసారీ కాపాడుతుందని భావించడం మూర్ఖత్వం. ఉత్తర కొరియా, రష్యా, ఇరాన్, చైనాలు ఈ ఆటలో పావులు కదుపుతుంటే, ప్రపంచం ఊపిరి బిగపట్టుకుని చూస్తోంది. శాంతి కోసం, స్థిరత్వం కోసం పోరాడే దేశాలకు ఇప్పుడు అత్యంత అవసరమైంది బ్రింక్‌మన్‌షిప్‌కు బదులు బ్రిడ్జ్‌మన్‌షిప్. అంటే అంచుల వైపు వెళ్ళడం కాదు, వారధులు నిర్మించడం. దౌత్యాన్ని అట్టడుగు పెట్టిన ప్రపంచానికి అది చేదు మందులా అనిపించవచ్చు. కానీ మనుగడకు అది తప్పనిసరి. ప్రపంచం ఈ నిజాన్ని గుర్తించే లోపు మరో సంక్షోభం తలుపు తట్టకుండా ఉంటుందా అనేది నేటి అత్యంత అత్యవసరమైన ప్రశ్న.



## నైరుతి రుతుపవనాలు.. ఒకింత లేట్..

మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించట్లేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతోంది. జూన్ 2నుంచి 4మధ్య రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనా. వాస్తవానికి మే 26నే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత వాతావరణ శాఖ అంచనా వేసింది. కానీ, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో ఐఎండీ అంచనాలు తలకిందులయ్యాయి. రుతుపవనాలు నెమ్మదిగా కదులుతుండటంతో రాక ఆలస్యమవుతోంది. కేరళను తాకిన రెండు మూడు రోజుల తర్వాత రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశముంది. గతేడాది, అంచనా వేసిన సమయానికంటే ఎనిమిది రోజులు ముందుగానే మే 24న కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి.

రుతుపవనాలు ఆలస్యమవుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి రోజురోజుకూ విషమిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు 45నుంచి 47 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవడంతో సాధారణంకంటే 4నుంచి 6 డిగ్రీల మేర అదనంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. గతవారం రోజుల వ్యవధిలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 200 నుంచి 300మంది వరకు వడదెబ్బకు బలైనట్టు క్షేత్రస్థాయి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒక్కరోజే తెలంగాణలో 52మంది, ఆంధ్రప్రదేశ్‌లో 25మంది వడదెబ్బకు బలయ్యారని సమాచారం అందుతోంది. ఉదయం పది గంటలనుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరో వారం రోజులపాటు ఠారెత్తించనున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఇది కేవలం తెలుగు రాష్ట్రాలకు మాత్రమే పరిమితం కాదు. ఢిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. రుతుపవనాలు కేరళను తాకిన తర్వాత కూడా, ఉత్తర దిశగా వాటి కదలిక నెమ్మదిగా, తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దేశానికి వార్షిక వర్షపాతంలో 70 శాతానికి పైగా వర్షాలు ఈ రుతుపవనాల ద్వారానే లభిస్తాయి. వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవిద్యుత్ ఉత్పత్తి, భూగర్భ జలాల పునరుద్ధరణకు ఈ వర్షాకాలం అత్యంత కీలకమైనది. అందువల్ల ఈ ఆలస్యం కేవలం ఎండల తీవ్రతకే కాదు, రైతులకు, తాగునీటి సరఫరాకు, విద్యుత్ ఉత్పత్తికి తీవ్రమైన ముప్పు కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువ పడొచ్చని పేర్కొంది. ఇక, జూన్‌లోనూ యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ప్రజలు ఈ పరిస్థితిలో అత్యంత జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి. వేడి, ఉక్కబోతవల్ల శరీరంనుంచి చెమట ద్వారా నీరు, ఎలక్ట్రోలైట్స్ కోల్పోతారు కాబట్టి దాహం వేసే వరకు వేచి చూడకుండా క్రమం తప్పకుండా నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, బయట పని చేసే కూలీలు మరింత జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వాలు వడదెబ్బ నివారణ కేంద్రాలు, మంచినీటి సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలను పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రుతుపవనాలు రావడం ఆలస్యమైనా, జనం సురక్షితంగా ఉండటానికి అవసరమైన చర్యలు మాత్రం ఏ మాత్రం ఆలస్యం కాకూడదు.

# మన రూపాయికే ఎందుకీ ఖర్మ?



భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గర్వంగా చెబుతున్నాం. జీడీపీ వృద్ధి రేటులో చైనాను మించిపోతున్నామని గణాంకాలు చూపుతున్నాం. అయినా, వృద్ధి కథలో చేదు నిజం దాగి ఉంది. అది భారత రూపాయి నిరంతర పతనం. నరేంద్ర మోదీ 2014లో మొదటిసారి అధికారం చేపట్టినప్పుడు అమెరికా డాలర్‌కు 58.94 రూపాయలు. 2019లో రెండోసారి అధికారానికి వచ్చేసరికి.. అది 69.37కి చేరింది. 2024లో మూడోసారి పదవీ బాధ్యతలు స్వీకరించేటప్పటికి 83.38కి పెరిగింది. ఇప్పుడు మూడో పదవీకాలం రెండేళ్లు పూర్తవుతున్న సమయంలో ఆ విలువ సుమారు 96కి చేరింది. పన్నెండేళ్లలో రూపాయి పతనం 62 శాతానికి పైగా. ఇది –సామాన్య భారతీయుడి జీవన వ్యయాన్ని ప్రతిబింబిస్తోంది. ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని చెప్పుకుంటున్నప్పుడు, కరెన్సీ ఎందుకు వెనక్కిపోతోంది? ఈ వైరుధ్యమే నేడు దేశ ఆర్థిక నిపుణులను, విధాన నిర్ణేతలను, సామాన్య పౌరులను వేధిస్తున్న ప్రశ్న. ఒకప్పుడు మోదీ ఆర్థిక విధానాలను ఉత్సాహంగా ప్రశంసించిన సుర్జీత్ భల్లా సైతం నేడు ఇదే ప్రశ్న లేవనెత్తుతున్నారు!


సాధారణంగా ఆర్థిక శాస్త్రం చెప్పే సూత్రమొకటి ఉంది. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ పోటీ దేశాలకంటే వేగంగా వృద్ధి చెందితే, ఆ దేశ కరెన్సీ బలోపేతమవుతుంది. ఎందుకంటే విదేశీ పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఎగుమతులు పెరుగుతాయి. వాణిజ్య మిగులు సాధ్యమవుతుంది. అయితే భారత్ విషయంలో ఈ సమీకరణ రివర్సైంది. జీడీపీ పెరుగుతోంది కానీ.. రూపాయి తగ్గుతోంది. మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ మే 26న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో రాసిన వ్యాసంలో –తుర్కియేను మినహాయిస్తే, యుద్ధానికి ముందు రెండు మూడేళ్ల కాలంలో బహుశా మరే దేశ కరెన్సీ కూడా భారత రూపాయి అంతగా పడిపోలేదన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపాయిని కాపాడేందుకు అసాధారణ స్థాయిలో జోక్యం చేసుకున్నా, అది విఫలమైందని నొక్కిచెప్పారు. 2022నుంచి 2026 ఫిబ్రవరి మధ్య రూపాయి 20 శాతానికి పైగా క్షీణించింది. ఆర్‌బీఐ చేసిన ప్రతి ప్రయత్నం నీళ్ళలో చేయి పెట్టినట్టే అయింది. ఇరాన్ యుద్ధం, ట్రంప్ విధించిన భారీ దిగుమతి సుంకాలు వంటి బాహ్య కారణాలు నిజంగా రూపాయిపై ఒత్తిడి పెంచాయి. కానీ అరవింద్ సుబ్రమణియన్ హెచ్చరిక ఏమిటంటే –ఈ బాహ్య కారణాలను వేలెత్తి చూపడం సులభం. కానీ అంతర్గత బలహీనతలను అవి కప్పిపుచ్చలేవని. ఇప్పుడు పరిసర దేశాలను, ఆసియా పొరుగు దేశాలను చూద్దాం. ఇదే కాలంలో మలేసియా రింగిట్ 9.25 శాతం బలోపేతమైంది. ఆ దేశ కరెన్సీ గత ఏడేళ్లలోనే అత్యంత బలమైన స్థాయికి చేరుకుంది. ఎందుకంటే మలేసియాలో కరెంట్ అకౌంట్ మిగులుంది. విదేశీ పెట్టుబడుల ప్రవాహం వేగంగా పెరిగింది. చైనా, యూరోపియన్ యూనియన్, మధ్యప్రాచ్య దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. స్పష్టమైన పారిశ్రామిక విధానాలు అమలు చేశారు. థాయ్‌లాండ్ బాట్ కూడా ఒక ఏడాది కిందటితో పోలిస్తే 10 శాతానికి పైగా బలపడింది. థాయ్‌లాండ్ అమెరికాతో వాణిజ్య మిగులు 35.6 బిలియన్ డాలర్ల నుంచి 51.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. సింగపూర్ ఆర్థిక వ్యవస్థ గత ఏడాది 5 శాతం వృద్ధి నమోదు చేసి, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 6 శాతానికి ఎగబాకింది. సింగపూర్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 66.7 శాతం మేర పెరిగాయి. చైనా యువాన్ మూడేళ్ల అత్యున్నత స్థాయికి చేరింది. ఇక పాకిస్తాన్ విషయానికి వస్తే –అది ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశంలోనూ.. ఆరు నెలల్లో రూపాయి 1.31 శాతం బలోపేతమైంది. అదేకాలంలో భారత రూపాయి ఆరు శాతానికి పైగా క్షీణించింది. పాకిస్తాన్ కరెన్సీ కంటే మన రూపాయి బలహీనంగా ఉందంటే, ఇది సిగ్గుపడాల్సిన విషయమా కాదా అని సగటు భారతీయుడు ప్రశ్నించుకోవడం సహజమే. ఈ పోలికలు రూపాయి పతనం వెనుక కేవలం అంతర్జాతీయ కారణాలు మాత్రమే లేవని, భారతదేశ అంతర్గత ఆర్థిక నిర్మాణంలోనే లోపాలున్నాయని స్పష్టంగా సూచిస్తున్నాయి.

రూపాయి పతనంతో నష్టాలు బహుముఖం. వాటి ప్రభావం సామాన్యుడి నిత్య జీవితంపై పడుతుంది. భారత్ తన అవసరాల కోసం ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటుంది. రూపాయి బలహీనపడినప్పుడు, అదే మొత్తంలో చమురు కొనడానికి ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. దాని ప్రభావం కూరగాయల ధరనుంచి ఆటోరిక్షా ఛార్జీ వరకూ అన్నిటిపై పడుతుంది. వంట గ్యాస్, ఎరువులు, ఎలక్ట్రానిక్స్ వంటి నిత్యావసరాల దిగుమతి ఖర్చులు కూడా అదే నిష్పత్తిలో పెరుగుతాయి. ఒక మధ్యతరగతి కుటుంబం వాడే స్మార్ట్‌ఫోన్ నుంచి పొలంలో వేసే ఎరువు వరకూ –రూపాయి పడిపోవడం అంటే ప్రతి వస్తువు ధర పెరగడమే. ఇది నిశ్శబ్ద పన్నులాంటిది.

అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిలో బలహీనమైన కరెన్సీ ఒక హెచ్చరిక సంకేతం. ఒక్క మే నెలలోనే విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్లలో రికార్డు స్థాయిలో 23 బిలియన్ డాలర్ల విలువైన షేర్లు విక్రయించారు. ఇది యాదృచ్ఛికం కాదు. మీరు ఒక దేశంలో పెట్టుబడి పెడతారు, ఆ దేశ కరెన్సీ పడిపోతే మీ పెట్టుబడి విలువ డాలర్ల లెక్కలో తగ్గిపోతుంది. అందువల్ల విదేశీ పెట్టుబడిదారులు వేరే మార్కెట్ల వైపుచూస్తారు. ఇది దేశంనుంచి డాలర్లు బయటకు వెళ్ళడానికి దారి తీస్తుంది. దానివల్ల రూపాయి మరింత బలహీనపడుతుంది. ఇది ఒక దుష్టచక్రం. కరెంట్ అకౌంట్ లోటును నిర్వహించడానికి, విదేశీ మూలధనం అవసరం. ఆ మూలధనమే బయటకు వెళ్ళిపోతే, సమతుల్యం సాధించడం మరింత కష్టం. ఇరాన్ యుద్ధం రూపాయిని దెబ్బతీసింది నిజమే, కానీ అదే యుద్ధం నేపథ్యంలో ఇతర ఆసియా కరెన్సీలు ఎందుకు పుంజుకున్నాయని ప్రశ్నించుకోవాలి. ఆ జవాబులోనే మన వైఫల్యాలకు సమాధానం దొరుకుతుంది.

రూపాయి బలహీనతకు మరోవైపు ప్రయోజనాలూ లేకపోలేదు. బలహీన రూపాయి భారతీయ ఎగుమతులను అంతర్జాతీయ మార్కెట్లో చౌకగా చేస్తుంది. దీనివల్ల సాఫ్ట్‌వేర్ సేవలు, వస్త్ర పరిశ్రమ, ఔషధాల ఎగుమతులు పోటీతత్వం పొందవచ్చు. 2025 మార్చినాటికి ముగిసిన ఒక ఏడాదిలో భారతదేశానికి 135 బిలియన్ డాలర్లకు పైగా రెమిటెన్స్‌లు వచ్చాయి. బ్రిటన్‌వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న వేళ, బలహీన రూపాయి ఒక పరిమితి మేరకు సాయపడవచ్చు. కానీ ఈ స్వల్పకాలిక ప్రయోజనాలు దీర్ఘకాలిక నష్టాలను చెరిపివేయలేవు. ప్రయోజనం ఒక వర్గానికి మేలు చేస్తే, నష్టం మాత్రం సమాజమంతటా పంచుకోవాల్సి వస్తుంది.

భారత రూపాయి బలోపేతం కావాలంటే రిజర్వ్ బ్యాంక్ జోక్యం సరిపోదు. అది కేవలం గాయానికి తాత్కాలిక కట్టు కట్టినట్టే. శాశ్వత పరిష్కారానికి కరెంట్ అకౌంట్ మిగులు సాధించాలి. ఎగుమతి రంగాన్ని, ముఖ్యంగా తయారీ రంగాన్ని బలపర్చాలి. విదేశీ పెట్టుబడిదారులకు మెరుగైన వ్యాపార వాతావరణం, పారదర్శక విధాన నిర్ణయాలు అందించాలి. చైనా, మలేసియా, సింగపూర్ చేసినట్టు –స్పష్టమైన పారిశ్రామిక ప్రణాళికలు, వ్యూహాత్మక వాణిజ్య ఒప్పందాలు, ఎఫ్‌డీఐ ఆకర్షణకు అనుకూల విధానాలు అమలు చేయాలి. ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందన్న గొప్పలు ఎంత పెద్దగా చెప్పుకున్నా, రూపాయి చెప్పే కథ వేరేగా ఉన్నంత కాలం ప్రపంచం విశ్వసించదు. ఒక దేశ కరెన్సీ శక్తి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు అద్దం పట్టే అత్యంత నిజాయితైన సూచిక. రూపాయికీ ఖర్మ పట్టిందంటే, నిజానికది మన ఆర్థిక విధాన నిర్ణయాలకే పట్టిన ఖర్మ. ■




చాలామంది శరీర అధిక బరువును వదిలించుకోలేకపోవడానికి కారణమేంటో తెలుసా..? ఓపిక లేకపోవడం! ఏళ్ల తరబడి అనారోగ్యకర అలవాట్లను అనుసరించడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు 2-3 నెలల్లోనే కరిగిపోతుందని, ఇంకెప్పటికీ తిరిగి రాదని భ్రమపడకండి. ఆరోగ్యపరంగా మీరు కోరుకుంటున్న మెరుగైన స్థితికి చేరుకునేందుకు చాలా నెలలు, అవసరమైతే కొన్నేళ్ల సమయం పట్టొచ్చు. ఓపికతో మీ కృషి కొనసాగించండి. గుర్తుంచుకోండి -మీ శరీరం మీకు శత్రువు కాదు. మీరు పెట్టే శ్రమకు తప్పకుండా స్పందిస్తుంది. కావలసింది సమయం మాత్రమే!

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## కాగితపు విహంగం!




చైనాలోని షెన్‌జెన్ జిలి మిడిల్ స్కూల్ విద్యార్థులు కాగితం విమానంతో గిన్నిస్ రికార్డ్ సాధించారు. 6.06 మీటర్ల రెక్కల విస్తీర్ణం, 5.06 మీటర్ల పొడవు ఉన్న ఈ రిమోట్ కంట్రోల్ పేపర్ ప్లేన్ 15 నిమిషాలు గాల్లో తేలింది! మనకు పాఠశాలలో కాగితం విమానం క్లాస్‌రూమ్‌లో మూడు సెకెండ్లు ఎగిరినా సంతోషపడిన రోజులు గుర్తున్నాయా? సగటు వయసు 16 ఏళ్ళే అయినా, ఈ జట్టు కార్బన్ ఫైబర్ సాంకేతికత వాడి విమాన రూపకల్పనను మూడుసార్లు మార్చి పరిపూర్ణంగా తయారు చేసింది. "కాగితం విమానం చేస్తాం" అంటే ఇంత పెద్దగా చేస్తారని ఎవరైనా ఊహించారా? టీచర్ "హోంవర్క్ చేశావా?" అంటే "లేదు సార్, రికార్డ్ చేశాం!" అని చెప్పొచ్చు!




## కష్టానికి తగ్గ ప్రతిఫలం..!

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. "సినిమారంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌నుంచి హిట్లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదోకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికీ కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటినుంచి ఏదో కొత్తపాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా" అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

## పోస్టర్!




## రేస్‌లోకి రవితేజ



జూన్‌నుంచి తెలుగు చిత్ర పరిశ్రమలో విడుదలల జోరు ఊపందుకుంటుంది. 'పెద్ది' మొదలు ఇక వరుసగా సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. జులై, ఆగస్టు నెలలపై చాలా సినిమాలే దృష్టిపెట్టాయి. ఆగస్టు నెలలో విడుదల ఖరారైన సినిమాల జాబితా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఆ నెల రేసులో రవితేజ 'ఇరుముడి' కూడా నిలిచే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఆ దిశగానే ఆ చిత్రానికి సంబంధించిన పనులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఆగస్టులో వర్షాలు కురిసినా, సినిమాలకి అది మంచి సీజన్. దాంతో ఆ నెలలో విడుదల కోసం చాలా సినిమాలు ఆసక్తి చూపుతున్నాయి. రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఇరుముడి'. తండ్రీకూతుళ్ల మధ్య భావోద్వేగాలే ప్రధానంగా సాగే చిత్రమని తెలుస్తోంది. త్వరలోనే పాట విడుదలతో ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు మొదలు పెట్టే యోచనలో చిత్రబృందం ఉన్నట్టు సమాచారం. జీవీ ప్రకాశకుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది.

## సందీప్ కిషన్ సిగ్మా డేట్ ఫిక్స్

తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదేస్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్, లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ఒకింత హుందాగా.. కాస్త ఘాటుగా..

బాలీవుడ్ నటి షమితా శెట్టిపై వస్తోన్న ట్రోలింగ్స్‌ను హుందాగా ఎదుర్కోవడమే కాదు, ఘాటుగా ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోషల్ మీడియాలో షమితపై ఓ నెటిజన్ "మీ వయస్సు పెరిగిపోయింది. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పటికైనా పెళ్లి చేసుకోవచ్చు కదా" అంటూ కామెంట్ చేశాడు. ఇలాంటి కామెంట్లను సాధారణంగా చాలమంది పట్టించుకోకుండా వదిలేస్తారు. కానీ షమిత మాత్రం ఎంతో హుందాగా, అదే సమయంలో గట్టిగానే స్పందించారు. "అవును.. నా వయస్సు పెరుగుతోంది. దాంతోపాటు మార్పులూ వస్తాయి. కాలంతోపాటు ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. శారీరక రూపురేఖలతో సహా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు" అంటూ పేర్కొన్నారు. అలాగే "నా వయస్సుకు తగ్గట్టుగా నేను ఫిట్‌గా ఉన్నాను. మానసికంగా ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నాను. అది చాలు" అంటూ ఆమె ఇచ్చిన సమాధానం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక పెళ్లిపై వచ్చిన కామెంట్‌కు షమితా ఇచ్చిన కౌంటర్ మరింత వైరల్ అవుతోంది. పెళ్లి చేసుకుని మీరేం సాధించారు? అంతగా పెళ్లై సెటిలయ్యామని అనుకునే మీరు.. నాలాంటి సింగిల్ వ్యక్తులను సోషల్ మీడియాలో ఎందుకు ఫాలో అవుతున్నారు? మా జీవితాలపై మీకెందుకు అంత ఆసక్తి?" అంటూ ట్రోలర్‌ను నేరుగా ప్రశ్నించారు. ఈ సమాధానంతో సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత జీవితాలపై అనవసర కామెంట్లు చేసే వారిపై ఆమె గట్టిగా స్పందించినట్లైంది. షమితా శెట్టి కామెంట్స్‌కు సోషల్ మీడియాలో మహిళా అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఒక మహిళ పెళ్లి చేసుకోవాలా? వద్దా? అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం. వయస్సు పెరిగిందని ట్రోల్ చేయడం సరైంది కాదు. షమితా చాలా మెచ్యూర్‌గా సమాధానమిచ్చారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



## ఓటీటీకి భూత్ బంగ్లా

అక్షయ్ కుమార్ హారర్ కామెడీ 'భూత్ బంగ్లా' ఓటీటీ ఆడియన్స్‌ని అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రం డిజిటల్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోవడం తెలిసిందే. జూన్ 12నుంచి సినిమా స్ట్రీమింగ్‌కు ఛాన్స్ ఉందని బాలీవుడ్ వర్గాల టాక్. చిత్ర యూనిట్‌నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'భూత్ బంగ్లా'పై భారీ అంచనాలకు కారణం.. అక్షయ్ కుమార్, ప్రియదర్శన్ మళ్లీ కలవడమే. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన కామెడీ ఎంటర్‌టైనర్లు బాలీవుడ్‌లో కల్ట్ క్లాసిక్స్‌గా నిలిచాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఈ జోడీకి ప్రత్యేకమైన క్రేజ్ ఉండటంతో 'భూత్ బంగ్లా'పై మొదటి నుంచే భారీ హైప్ ఏర్పడింది. సాధారణంగా హారర్ కామెడీ సినిమాలు ఎక్కువగా జంప్ స్కేర్స్‌పైనే ఆధారపడుతుంటాయి. కానీ 'భూత్ బంగ్లా' మాత్రం ఆ ఫార్ములాకు భిన్నంగా తెరకెక్కింది. అతీంద్రియ శక్తులు, గ్రామీణ జానపద కథలు, ఎమోషనల్ డ్రామా, ప్రియదర్శన్ స్టైల్ కామెడీ అన్నింటినీ కలిపి ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించారు. ఈ సినిమా పాత బాలీవుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ల ఫీలింగ్‌ను గుర్తుచేస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



## 'శక్తి శాలిని'గా పడ్డా

'స్త్రీ', 'ముంజ్యా'లాంటి పలు విజయంతమైన చిత్రాలను నిర్మించిన మడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలినీ'. 'సైయారా' విజయంతో సినీప్రియుల్ని మురిపించిన కథానాయిక అనీత్ పడ్డా ఈ సినిమాలో ప్రధానపాత్రలో నటిస్తుంది. ఆదిత్య సర్పోద్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినయంలో కనిపించనుందని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతుంది. తాజాగా ఈ సినిమా జానపద కథ నేపథ్యంలో రూపొందుతుందని తెలిసింది. "బెంగాలీ పురాణాలలోని ఒక జానపద కథాంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా భారీ క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణను కూడా పూర్తి చేశారు. ఈ చిత్రం శక్తి, శాలినిల మధ్య రివెంజ్ డ్రామాగా రూపొందుతుంది. అనీత్ ఇందులో శక్తి అనే రక్షకురాలిగా, ప్రతీకారం తీర్చుకోవాలనే శాలినీ అనే ఆత్మగా ద్విపాత్రాభినయం చేస్తోంది. ఇందులో ఈ రెండు పాత్రల మధ్య జరిగే ఘర్షణ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద"ని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంతో పాటు మోహిత్ సూరి దర్శకత్వంలో అహాన్ పాండే సరసన ఓ చిత్రంలో నటిస్తోంది అనీత్.



Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com